సాక్షి
ఖమ్మం
సోమవారం । 27 । నవంబర్ । 2023



ఏర్పాట్లు పూర్తిచేయండి

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. 6లో



ఇది 'రాజు'లపేట!

కూసుమంచి మండలం రాజుపేట వాసులైన ఉపేందర్‌రెడ్డి, వెంకటవీరయ్య ఎమ్మెల్యేలుగా కొనసాగుతుండగా, మళ్లీ బరిలో నిలిచారు. 6లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం, సాయంత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది. మిగతా సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

జమలాపురంలో కార్తీక పౌర్ణమి వేడుకలు



జ్వాలా తోరణాన్ని దహనం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తీక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో అర్చకులు జ్వాలాతోరణం ఏర్పాటు చేసి దహనం చేశారు. అనంతరం కార్తీక పౌర్ణమి ప్రాధాన్యతను అర్చకులు భక్తులకు వివరించగా.. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు దీపాలు వెలిగించారు. ఆ తర్వాత శ్రీవేంకటేశ్వరస్వామి, అమ్మవార్లతో పాటు శ్రీసోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ విజయకుమారి, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులకు వాహనాలు సిద్ధం



సెక్టార్ అధికారులకు కేటాయించిన వాహనం

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల విధుల్లో క్షేత్ర పర్యటనల కోసం సెక్టార్ అధికారులకు వాహనాలు కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలను 131 రూట్లుగా విభజించి ఇంతే సంఖ్యలో వాహనాలను కేటాయించగా, అదనంగా 17 కలిపి 148 వాహనాలు సమకూర్చామని పేర్కొన్నారు. ఇందులో ఖమ్మం నియోజకవర్గంలోని 30 రూట్లకు గాను 34, పాలేరుకు 27 రూట్లకు గాను 31, మధిరకు 25 రూట్లకు 27, వైరాలో 22 రూట్లకు గాను 26, సత్తుపల్లిలో 27 రూట్లకు గాను 30 వాహనాలు జీపీఎస్ అనుసంధానించిన వాహనాలు సిద్ధం చేశామని తెలిపారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ వసతుల కల్పనను పర్యవేక్షించడమే కాక పోలింగ్ సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తారని కలెక్టర్ వెల్లడించారు.

జిల్లాకు కేంద్ర బలగాలు



ఖమ్మం సహకారనగర్: పోలింగ్ ప్రశాంతంగా సాగేలా కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించిన అదనపు బలగాలు ఆదివారం జిల్లాకు చేరుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వీరు విధులు నిర్వర్తించనున్నారు. కాగా, అదనపు కేంద్ర సాయుధ బలగాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో మోహరిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు.

రేపటితో తెర

- చివరి దశకు చేరిన ఎన్నికల ప్రచారం
- ఉమ్మడి జిల్లాను చుట్టేసిన రాజకీయ పార్టీల అగ్రనేతలు
- కేసీఆర్, కేటీఆర్ పర్యటనలతో జోష్‌లో గులాబీ శ్రేణులు
- రాహుల్, ప్రియాంక రాకతో కాంగ్రెస్‌లో కోలాహలం
- సీపీఎం, సీపీఐ నేతల సందడితో క్యాడర్ కదనోత్సాహం
- ఈ రెండు రోజులు కీలక ప్రాంతాలపై నజర్



ఎన్నికల ప్రచార సమరానికి మంగళవారం తెరపడనుంది. ఎక్కడెక్కడ బలహీనంగా ఉన్నామో తెలుసుకున్న పార్టీల నాయకులు మిగిలిన రెండు రోజులు ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఓ వైపు ఓటుకు నోటు పంచుతూనే మరోవైపు పోల్ మేనేజ్‌మెంట్‌పై నజర్ పెట్టారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారం ఒక ఎత్తయితే.. ఓటరు మనసులో తమ గుర్తును ముద్రించి పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లడాన్ని కీలకంగా భావిస్తూ అభ్యర్థులు, అనుచరులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రచారం చేయగా.. కాంగ్రెస్ నుంచి రాహుల్, ప్రియాంకాగాంధీ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా రావడంతో ఆయా పార్టీల కేడర్‌లో జోష్ పెరిగినట్లయింది. మరోవైపు బీజేపీ, జనసేన.. పవన్‌కళ్యాణ్, ఇతర ముఖ్య నేతలను తీసుకొచ్చి ప్రచారం చేయించింది. మొత్తానికి అగ్రనేతల ప్రచారం ముగియగా, మిగిలిన సమయంలో అభ్యర్థులు వ్యూహప్రతివ్యూహాల్లో మునిగి తేలనున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

'గులాబీ' గుబాళించేలా...

బీఆర్‌ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైరా మినహా సిట్టింగ్‌లందరికీ అవకాశం ఇచ్చింది. అన్ని పార్టీల కంటే ముందుగా టికెట్లు ప్రకటించగా, దాదాపు మూడు నెలల పాటు అభ్యర్థులు, పార్టీ శ్రేణులు ప్రచారాన్ని హోరెత్తించారు. సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు కలిసేలా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ ఎందుకు రావాలో చెబుతూ.. గత కాంగ్రెస్ పాలన తీరుపై ప్రతీ సభలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా స్థానికంగా తమ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ప్రస్తావించారు. మళ్లీ గెలిస్తే నియోజకవర్గాల్లో చేయనున్న పనులపై హామీలు గుప్పించారు. పార్టీ అభ్యర్థులను ప్రశంసిస్తూ ఆయన ప్రసంగాలు కొనసాగాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్‌కు అత్తెసరు స్థానాలే దక్కాయి. దీంతో ఈసారి తమ ప్రభుత్వమే రాబోతుందని, అందులో ఖమ్మం జిల్లా మెజార్టీ భాగస్వామ్యం ఉండేలా ప్రజలు సీట్లు ఇవ్వాలని కేసీఆర్ పదేపదే చెప్పారు. మంత్రి కేటీఆర్ రోడ్డు షోలు కూడా ఇలానే సాగాయి. దరిమిలా గులాబీ గుబాళించేలా ప్రచారం చేయగలిగామని.. తద్వారా గతంలో కంటే ఉమ్మడి జిల్లాలో ఆశాజనకంగా ఫలితాలు వస్తాయని ముఖ్యనేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కాంగి'రేస్'లో అభ్యర్థులు

గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఈసారీ అదే హవా ఉంటుందని భావిస్తోంది. క్షేత్ర స్థాయి సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థులను దఫదఫాలుగా ప్రకటించింది. ఆ తర్వాత ప్రచారానికి ఉన్న కొద్ది సమయాన్ని ప్రణాళికాయుతంగా వాడుకున్నట్లు పార్టీ చెబుతోంది. రాహుల్, ప్రియాంకాగాంధీ పర్యటన ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులు, నేతలు, కేడర్‌లో ఉత్సాహాన్ని నింపాయి. మణుగూరులో రోడ్డు షోతో రాహుల్‌గాంధీ పినపాక నియోజకవర్గంలో ప్రచారాన్ని పూర్తి చేశారు. ఇక ప్రియాంకగాంధీ ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రోడ్డు షోలు, మధిరలో విజయభేరి సభకు హాజరై పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూనే బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంపై విమర్శలు ఎక్కుపెట్టారు. మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. వీరేకాక ఏఐసీసీ, టీపీసీసీ నేతలు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. అగ్రనేతల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఇప్పటి వరకు వెళ్లని ప్రాంతాలను ఈ రెండు రోజుల్లో చుట్టాలని కార్యాచరణ రూపొందించుకున్నారు.

పట్టు కోసం కామ్రేడ్లు..

సీపీఎం ఈ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగింది. కొత్తగూడెం, పినపాక మినహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ అభ్యర్థులు అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. పాలేరు నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీలో నిలవగా.. ఎలాగైనా ఈసారి అసెంబ్లీ గేటు తాకాలని సర్వశక్తులు ఒడ్డుతోంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. ఇక కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న సీపీఐ కొత్తగూడెం నుంచి బరిలోకి దిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీలో నిలిచారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి నారాయణ, రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు కూనంనేని విజయం కోసం ప్రచారం నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రచారానికీ వారు హాజరయ్యారు. సీపీఐ కొత్తగూడెం స్థానంపై ఆశలు పెట్టుకోగా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించింది.

బీజేపీ, జనసేన..

బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలో దింపాయి. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కొత్తగూడెంలో తమ పార్టీ అభ్యర్థి ప్రచారానికి హాజరయ్యారు. అలాగే, బీజేపీ రాష్ట్ర పార్టీ, జాతీయ పార్టీ నేతలను రప్పించి ప్రచారం చేయించింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని విమర్శలు చేస్తూ తమ అభ్యర్థులను గెలిపించాలని ఆపార్టీ నేతలు పిలుపునిచ్చారు.



Interview

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జనమే మా బలం

- వచ్చేనెల 9న కాంగ్రెస్ సీఎం ప్రమాణస్వీకారం
- పాలేరు ప్రజలకు ఏం కావాలో నాకు తెలుసు
- నియోజకవర్గమంతా బ్రహ్మరథం పడుతున్నారు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని స్థానాలూ గెలుస్తాం
- పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా నేను నామినేషన్ వేసిన రోజే ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి నన్ను ఆశీర్వదించారు. ప్రియాంకాగాంధీ రోడ్డు షోకు సునామీలా వచ్చారు. దీంతో జనమే కాంగ్రెస్ బలమని నిరూపితమైంది. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్, మరో స్థానంలో సీపీఐ గెలుస్తుంది. ఒక్క పాలేరు, ఉమ్మడి ఖమ్మం జిల్లానే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్న నేపథ్యాన వచ్చేనెల 9న కాంగ్రెస్ పార్టీ సీఎం ప్రమాణ స్వీకారం చేయడం ఖాయం. పాలేరు ప్రజలకు భవిష్యత్‌లో ఏం కావాలో శ్రీనివాసరెడ్డికి తెలుసు. ఉపేందర్‌రెడ్డిని చూసో.. వారి బాస్‌ను చూసో నేనేం భయపడటం లేదు. మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు' అని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలేరు అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొంగులేటి ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

పాలేరు అక్కున చేర్చుకుంటోంది..

ప్రచారంతో పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పలుమార్లు తిరిగా. వారి కళ్లల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పడిన ఇబ్బందులు కనిపించాయి. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బాధలు తీరుతాయనే ఆనందాన్నీ చూశాను. ఏ గ్రామానికి వెళ్లినా రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తమ బాధలను చెబుతున్నారు. తెలంగాణ తెచ్చుకుంది వీరిని బాధల్లోకి నెట్టడానికా? తెలంగాణ ప్రజల కష్టాలు తీర్చేందుకే సోనియమ్మ రాష్ట్రాన్ని ఇచ్చింది. కానీ ప్రజల కలలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్లలు చేసింది. మేం అధికారంలోకి రాగానే పాలేరులోనే కాదు.. రాష్ట్ర ప్రజలందరి ఆకాంక్షలు నెరవేరుతాయి.

తాగేందుకు నీరు లేని గ్రామాలు

మినరల్ వాటర్ మాదిరి తాగునీరు ఇచ్చామని బీఆర్‌ఎస్ నేతలు గొప్పగా చెబుతున్నారు. కానీ ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలో 34 నుంచి 35 శాతం పైగా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. పాలేరు నియోజకవర్గంలో కొన్ని గ్రామాలకు వెళ్తే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు కావాలని కోరుతున్నారు. ప్రస్తుత పాలకులు ఇవన్నీ చేస్తే ఎందుకు అడుగుతారు? ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితేంటి. డ్యామ్ నెర్రెలిచ్చింది. కేంద్ర అధికారులే నివేదికలు ఇచ్చారు. ఇలా ఏ పనినీ కేసీఆర్ ప్రభుత్వం సక్రమంగా చేయలేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ ఇబ్బందులు తీరుతాయనే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే...

తెలంగాణలో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమే. అందుకే కాంగ్రెస్ నేతల సంస్థలపై ఈడీ, ఐటీ దాడులతో భయపెట్టాలని చూస్తున్నారు. ఎవరేం చేసినా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 75 నుంచి 78 సీట్లు తప్పకుండా వస్తాయి. డిసెంబర్ 9వ ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆ తర్వాత ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్, మా పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన సీపీఐ గెలుస్తుంది. ఉమ్మడి జిల్లాలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీపీఐ నేతల పర్యటనతో ప్రజలు ఎటువైపు ఉన్నారో తేలిపోయింది. ఈ జనసంద్రం రాష్ట్రమంతా ఉంది.

ప్రతీ కార్యకర్త కష్టపడాలి..

కార్యకర్తలు కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకుని అహర్నిశలు కష్టపడి, అవమానాలను, కేసులను ఎదుర్కొన్నారు. ఎన్నికల ప్రచారానికి రెండు రోజులే సమయం ఉంది. ఆతర్వాత ఈ ప్రభుత్వాన్ని సాగనంపడమే. కార్యకర్తలు, అభిమానులు .. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు కోసం కృషి చేయాలి. బంధువులు, శ్రేయోభిలాషులంతా కాంగ్రెస్‌కు ఓటు వేసేలా చూడండి. వచ్చే ఐదేళ్లలో ఏ ఎమ్మెల్యేతోనూ అభద్రతాభావం ఎదురుకాదు. పార్టీ శ్రేణులను కాపాడుకునే బాధ్యత మేము తీసుకుంటాం.

తెలంగాణ ఆశయం నెరవేరలేదు

తెలంగాణ ఉద్యమం ఈనాటిది కాదు. తొలి విడతలోనూ అన్నివర్గాల ప్రజలు ఉద్యమిస్తే, మలి విడతలోనూ అన్ని పార్టీలు, సంస్థలు, ప్రజలు పాల్గొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో అవేమీ నెరవేరలేదు. సీఎం కేసీఆర్ నోటి నుంచి వచ్చే అబద్ధాలు, మోసపూరితమైన మాటలను రెండుసార్లు నమ్మిన ప్రజలు ఈసారి నమ్మే పరిస్థితి లేదు. తెలంగాణ రాష్ట్రం సోనియాగాంధీ వల్లనే వచ్చిందని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. కానీ ఇప్పుడు సోనియా ఎవరు, రాహుల్ ఎవరు అంటున్నారు. మాటల గారడీతో ప్రజలను మోసం చేసే సామర్థ్యం కేసీఆర్‌కు ఉన్నా అన్నివేళలా సాధ్యం కాదు.

యాదవులకు రాజ్యాధికారం ఇచ్చింది కేసీఆరే..

- అంతా ఏకమై బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి
- ఆత్మీయ సమ్మేళనంలో పువ్వాడ అజయ్‌కుమార్



సమ్మేళనంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్, పక్కన బాలరాజు, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: యాదవులను గుర్తించి వారిని రాజ్యాధికారంలో దివంగత ఎన్టీఆర్ భాగస్వాములను చేస్తే, నేడు రాజ్యాధికారం ఇచ్చింది సీఎం కేసీఆరేనని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలో ఆదివారం తెలంగాణ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు ఆధ్వర్యాన జరిగిన అఖిల భారత యాదవ మహాసభ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ బీసీలను విస్మరించగా... ఆ పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి యాదవులకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ఇప్పుడు తెలంగాణలో సీఎం కేసీఆర్ యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడమే కాక ఇతర పదవులు ఇచ్చారని చెప్పారు. ఖమ్మం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా కూరాకుల నాగభూషణంను డీసీసీబీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తాను, ఎంపీ నామ నాగేశ్వరరావు కృషి చేశామన్నారు. యాదవులకు రాజ్యాధికారం ఇచ్చిన బీఆర్‌ఎస్‌లో ఎవరినీ అసెంబ్లీ గేట్ తాకనివ్వనని చెప్పిన వ్యక్తిని ఓడించాల్సిన అవసరముందని పువ్వాడ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని యాదవులంతా ఏకమై బీఆర్‌ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ మాట ఇస్తే తప్పని చరిత్ర యాదవులకు ఉందని తెలిపారు.

ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో యాదవ సంఘానికి సీఎం కేసీఆర్, పువ్వాడ అజయ్ స్థలాలు కేటాయించారన్నారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు అమరగాని వెంకన్న, చిలకల వెంకటనరసయ్య, చిత్తారు సింహాద్రి, మేకల సుగుణారావు, కోడి లింగయ్య, పగడాల మధు, కాట్రాల శ్రీరాములు, మేకల కోటయ్య, రాంమూర్తి, మోహన్‌రావు, మల్లేష్, రాములు, తొట్టి వెంకన్న, కోటి, బారి మల్సూర్, మేకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబిడ్డగా పుట్టాను..

- 135దేశాల్లో హెటిరోను విస్తరించాం
- సండ్ర వెంకటవీరయ్యతో నేనున్నా..
- రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి: 'రైతుబిడ్డగా పుట్టాను... సైకిల్‌పై వెళ్లి సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివా.. ఖమ్మం ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియాలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసి కేన్సర్ విభాగంలో పీహెచ్‌డీ చేశాను. చదువుల్లో ఎప్పుడూ ఫస్ట్ వచ్చేవాణ్ణి. నాకు ఇష్టమైంది టీచర్ ఉద్యోగం. రూ.600వేతనంతో 1980లో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించాను' అని పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి వెల్లడించారు. సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం 135దేశాల్లో హెటిరో సంస్థను విస్తరించగా... అమెరికా, రష్యా, బ్రెజిల్, చైనా, జపాన్ తదితర దేశాల్లో కలిపి లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్నానన్నారు. తన సంపద మొత్తం నీతి, నిజాయితీగా సంపాదించిందేనని, అత్యధికంగా పన్నులు కట్టిన ఫార్మా కంపెనీ తనదేనని తెలిపారు.

ఒక విజన్‌తో పనిచేస్తున్నా..

సత్తుపల్లి జిల్లా, ఐటీ హబ్, శిల్పారామం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నానని పార్థసారథిరెడ్డి తెలిపారు. ఇప్పటికే అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. సత్తుపల్లిలో రూ.4కోట్లతో అతిపెద్ద గ్రంథాలయం, వేంసూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, కల్లూరు, పెనుబల్లి, వేంసూరుల్లో బస్టాండ్ల నిర్మాణాలే కాక మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సత్తుపల్లి ఎస్‌టీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్తుపల్లి ఉర్దూ మదర్సా అభివృద్ధికి రూ.25లక్షలు, కల్లూరుకు డిగ్రీ కళాశాల, వేంసూరు, మర్లపాడును అభివృద్ధి చేయడం తదితర పనులను రూ.10కోట్ల నుంచి రూ.12కోట్ల సొంత నిధులతో చేపట్టాలనే ప్రణాళిక ఉందని వివరించారు.

వెంకటవీరయ్యతో నేనున్నా..

బీఆర్‌ఎస్ సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విజయం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నానని, మంచి మెజార్టీతో ఆయనను గెలిపిస్తే ఈ ప్రాంతానికి మంత్రి పదవి ఇచ్చేలాసీఎంతో చర్చిస్తానని తెలిపారు. తద్వారా సత్తుపల్లి మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సీతారామ ప్రాజెక్టు డిజైన్‌ను సీఎం కేసీఆర్ దూరదృష్టితో మార్చి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా సిద్ధం చేశారని, ఈ పనులు 18నెలల్లో పూర్తవుతాయని తెలిపారు. సండ్ర వెంకటవీరయ్యతో కలిసి మండలానికి ఒక మేనిఫెస్టో తయారు చేశామని, ఎన్నికలు పూర్తికాగానే ఇద్దరం అందులోని అంశాల అమలుకు కట్టుబడి పనిచేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న బండి పార్థసారథిరెడ్డి

సీఎం అంటే ఇష్టం..

తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడిన సీఎం కేసీఆర్‌కు తొలుత పారిశ్రామికవేత్తగా మద్దతుగా నిలిచానని బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. పదమూడేళ్ల పోరాట ఫలితమే తెలంగాణ అని, అందుకే సీఎం కేసీఆర్ అంటే తనకు ఇష్టమని చెప్పారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు రాజ్యసభ సభ్యత్వం ఇచ్చారని, ఆయన ఆశయం కోసం పనిచేయడాన్ని తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యకు మద్దతు పలకాలని ఆయన కోరారు.

ధర్మానికి, అధర్మానికి మధ్య పోరాటం

- కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధమైన ప్రజలు
- రోడ్‌షోలో భట్టి విక్రమార్క, పొంగులేటి, తుమ్మల



మధిరలో అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల

మధిర: తెలంగాణలో ధర్మానికి, అధర్మానికి నడుమ పోరాటం జరుగుతోందని.. ప్రజలు మాత్రం ధర్మం వైపే నిలబడి ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన నిలుస్తారని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. మధిర కాంగ్రెస్ అభ్యర్థి భట్టి విజయాన్ని కాంక్షిస్తూ.. మధిర మండలంలోని దెందుకూరు, ఇల్లెందులపాడు మీదుగా మధిర వరకు ఆదివారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ప్రజలంతా కాంగ్రెస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్న నేపథ్యాన మరికొద్ది రోజుల్లోనే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ నోట్ల కట్టల పంచులు తమ విజయాన్ని ఆపలేవని స్పష్టం చేశారు. కొట్లాడి, కోరి తెచ్చుకున్న తెలంగాణలో సంపద కేసీఆర్ కుటుంబం పాలుకాగా.. ప్రజల ఆశలేవీ నెరవేరలేదని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే తొలి కేబినెట్ మీటింగ్‌లోనే ఆరు గ్యారంటీల పథకాలను ఆమోదిస్తామని, 100 రోజుల్లో అమలుచేసి చూపిస్తామని వెల్లడించారు. సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన మధిర నియోజకవర్గంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. మధిర ప్రజల ఓటు అభివృద్ధికి ఉపయోగపడాలని.. తద్వారా నిధులు వరదలా పారించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వివిధ పార్టీల నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, డాక్టర్ కోట రాంబాబు, మల్లాది హన్మంతరావు, బెజవాడ రవిబాబు, సూరంశెట్టి కిషోర్, చేకూరి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భట్టిని గెలిపిస్తేనే అభివృద్ధి

ఎర్రుపాలెం/బోనకల్: మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్కను గెలిపిస్తేనే నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతాయని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎర్రుపాలెం మండలంలోని గుంటుపల్లి గోపవరం నుండి పెద్ద గోపవరం మీదుగా మీనవోలు వరకు రోడ్‌షో నిర్వహించగా వారు మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని తెలిపారు. అలాగే, బోనకల్ మండలంలోని కలకోట, బ్రాహ్మణపల్లి, రావిల్లి క్రాస్, జానకీపురం క్రాస్, సీతానగరం మీదుగా జరిగిన రోడ్ షోలో కూడా వారు మాట్లాడారు. ఈసమావేశాల్లో జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాపరెడ్డితోపాటు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కోటా రాంబాబు, బండారు నర్సింహారావు, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణ రావు, శీలం ఉమామహేశ్వరి, షేక్ జానీబాషా, పైడిపల్లి కిషోర్, బంధం నాగేశ్వరరావు, గాలి దుర్గారావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సాక్షి' విలేకరి వైద్యఖర్చులు భరిస్తా..

ఎంపీ బండి పార్థసారథిరెడ్డి


సాంబశివరావు కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి: బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్తుపల్లి 'సాక్షి'రూరల్ విలేకరి కొవ్వూరు సాంబశివరావు వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం భరిస్తానని ఎంపీ బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నుంచి ఆదివారం ఆయన సాంబశివరావు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. తమ సంస్థ నుంచి వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. ఇక త్వరలోనే ప్రారంభమయ్యే సింధు ఆస్పత్రిలో ఈ ప్రాంత జర్నలిస్టులకు ఉచిత వైద్యసేవలు అందిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా సాంబశివరావు కుటుంబ సభ్యులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

అద్దంకి విజయ్‌కాంత్‌కు పీహెచ్‌డీ


విజయ్‌కాంత్

మధిరరూరల్ : ఉస్మానియా యూనివర్సిటీ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అద్దంకి విజయ్‌కాంత్‌కు డాక్టరేట్ లభించింది. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన విజయ్‌కాంత్ ఓయూలోనే కెమికల్ ఇంజనీరింగ్‌లో పీజీ పూర్తి చేశారు. ఓయూ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.శ్యాంసుందర్ పర్యవేక్షణలో 'నావెల్ అండ్ ఇంటెన్సిఫైడ్ ప్రాసెస్ ఫర్ ద ప్రొడక్షన్ ఆఫ్ డైమిథైల్ పామా అమైడ్ డైమిథైల్ ఎసిటాల్' అంశంపై ఆయన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. దీంతో విజయ్‌కాంత్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఓయూ అధికారులు వెల్లడించారు.

కర్ణాటకలో హామీలన్నీ అమలుచేస్తున్నాం..

ఖమ్మంవన్‌టౌన్: కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ చెన్నితల వెల్లడించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలు, అంకెల గారడీతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని తెలిపారు. కానీ, కాంగ్రెస్ మాత్రం కర్ణాటకలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేయగా, తెలంగాణలోనూ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తుందని చెప్పారు. ఈ మేరకు కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని రమేష్ కోరారు. సమావేశంలో ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జ్ బీఆర్.అనిల్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, నాయకులు షేక్ రషీద్, ఏలూరి రవికుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో యువకుడు మృతి

త్వరలో అమెరికా ప్రయాణానికి ఏర్పాట్లు


శ్రీరామ్ (ఫైల్)

కామేపల్లి: ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువకుడు అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా జ్వరం ఆయనను బలి తీసుకుంది. జ్వరంతో బాధపడుతున్న ఆయనకు చికిత్స చేయిస్తుండగానే మృతి చెందాడు. మండలంలోని ఊట్కూర్‌కు చెందిన నల్లపాటి శ్రీరామ్(28) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించగా శ్రీరామ్ మృతి చెందాడు. కాగా, శ్రీరామ్ ఇంజనీరింగ్ పూర్తిచేయగా, ఎంఎస్ చదివేందుకు డిసెంబర్ 15న అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలోనే కన్నుమూయడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

ప్రమాదానికి కారణమని లారీడ్రైవర్‌పై దాడి

నేలకొండపల్లి: రెప్పపాటున రోడ్డుప్రమాదం తప్పగా, అందుకు కారణమైన లారీ డ్రైవర్‌పై స్థానికులు దాడి చేసిన ఘటన ఇది. నేలకొండపల్లి సమీపంలో నేషనల్ హైవే వంతెన మీదుగా కోరట్లగూడెం క్వారీలో పనిచేసే జగ్గయ్యపేటకు చెందిన దంపతులు బైక్‌పై వెళ్తున్నారు. అయితే, కోనాయిగూడెం నుంచి వస్తున్న గ్రానైట్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయటంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న దంపతులు రోడ్డుపై పడ్డారు. రెప్పపాటులో పెను ప్రమాదం తప్పినా, బాధితుల బంధువులు రావడంతో లారీ డ్రైవర్‌పై దాడి చేసి సెల్‌ఫోన్, లారీ తాళాలు లాక్కున్నారు. దీంతో వివాదం మొదలై తారస్థాయికి చేరగా, లారీ యాజమానులు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి గాయపడిన వారికి వైద్యం చేయించడంతో వివాదం సద్దుమణిగింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

ఇది.. రాజులపేట..!

ఒకే గ్రామం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు

- ఇప్పటికే నాలుగు సార్లు గెలిచిన సండ్ర వెంకటవీరయ్య
- గత ఎన్నికల్లో విజయం సాధించిన కందాళ
- ఈసారి సత్తుపల్లి, పాలేరు నుంచి ఇద్దరూ బరిలో

కూసుమంచి మండలంలోని రాజుపేట రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఎందుకంటే ఈ గ్రామానికి చెందిన కందాళ ఉపేందర్‌రెడ్డి పాలేరు ఎమ్మెల్యే కాగా.. సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ ఎన్నికల్లోనూ వీరిద్దరు బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచారు. గ్రామస్తులు ఇద్దరు ఎమ్మెల్యేలుగా కొనసాగుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేల పనితీరుతో గ్రామానికి రాజకీయంగా పేరు ప్రతిష్టలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. – కూసుమంచి


ఎమ్మెల్యే వెంకటవీరయ్య ఇల్లు




రాజుపేటలోని ఎమ్మెల్యే కందాళ ఇల్లు

ఏడోసారి బరిలో సండ్ర

వెంకటవీరయ్య విద్యార్థి దశలోనే రాజకీయ అరంగేట్రం చేశారు. విద్యార్థి నాయకుడిగా ఉండగానే తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం నుండి పాలేరు అసెంబ్లీకి పోటీచేశారు. తొలిప్రయత్నంలోనే కాంగ్రెస్ అభ్యర్థి సంభాని చంద్రశేఖర్‌పై 10,156 ఓట్ల తేడాతో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. తిరిగి 1999లో సీపీఎం నుంచే పోటీ చేసి సంభానిపై 11,258 ఓట్లతో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో సీపీఎం నుండి టీడీపీలో చేరిన వెంకటవీరయ్య 2004లో పాలేరు నుండి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈఎన్నికల్లో మరోమారు కాంగ్రెస్ అభ్యర్థి సంభాని చేతిలో 23,922 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఇక 2009లో పాలేరు జనరల్‌కు రిజర్వ్ కావడంతో వెంకటవీరయ్య ఎస్సీ రిజర్వ్ అయిన సత్తుపల్లి నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. 2009 నుండి వరుసగా మూడు పర్యాయాలు టీడీపీ నుండి సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. అనంతర పరిణామాల్లో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ నుండి బరిలో నిలిచారు.

రెండోసారి బరిలో కందాళ

పాలేరు ప్రస్తుత ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రస్తుతం రెండోసారి ఎమ్మెల్యేగా పోటీలో ఉన్నారు. 2018 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావును 7,669 ఓట్లతో ఓడించారు. అతర్వాత బీఆర్‌ఎస్‌లో చేరిన కందాళ ఈ ఎన్నికల్లో అదే పార్టీ నుండి రెండోసారి పోటీలో ఉన్నారు. ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి ఇరువురు తొలిప్రయత్నంలోనే ఎమ్మెల్యేలు కావటం విశేషం. ఇక వెంకటవీరయ్య ఏకంగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందటం మరో విశేషంగా చెప్పుకోవచ్చు. ఈసారి ఫలితాల్లో ఇరువురి అదృష్టం ఎలా ఉందో వేచి చూడాల్సిందే.

మాకు గర్వంగా ఉంది



మా ఊరికి చెందిన కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య ఎమ్మెల్యేలుగా ఉండటం మాకు గర్వంగా ఉంది. వారి వల్ల మా ఊరు రాజకీయంగా పేరు తెచ్చుకుంది. కందాళ ఉపేందర్‌రెడ్డి మంచి పనులు చేస్తూ ఊరి పేరు నిలబెట్టారు. ఇద్దరూ ఈసారి ఎన్నికల్లో కూడా గెలిచి మా ఊరు పేరు నిలపాలి.

– పాలడుగు గిరిరాజు

ఊరు అభివృద్ధి చెందుతోంది...



మా ఊరి నుండి తొలుత ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్య ఉన్నారు. ఇప్పుడు ఆయనతో పాటు మా నియోజకవర్గానికే కందాళ ఉపేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. మా గ్రామం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండడంతో అభివృద్ధి చెందుతోంది. గతంతో పోలిస్తే చాలావరకు సమస్యలు పరిష్కారమయ్యాయి.

– బానోత్ మహేష్

నా మేనల్లుడు నాలుగు సార్లు ఎమ్మెల్యే..



సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య నా మేనల్లుడు. ఒకసారి పాలేరు, మూడు సార్లు సత్తుపల్లిలో ఎమ్మెల్యేగా గెలిచాడు. మా వాడు ఎమ్మెల్యే అని చెప్పుకోవడం ఆనందంగా ఉంది. ఉపేందర్ రెడ్డిదీ మా ఊరే కావటం గర్వకారణం. మంచి పనులు చేస్తున్న ఇద్దరూ మళ్లీ గెలవాలని కోరుకుంటున్నా.

– కిన్నెర నర్సయ్య

అభ్యర్థులను ఆశీర్వదించే యోగానందుడు!

- ఆయన అనుగ్రహం తీసుకున్నాకే ముందుకు...
- ప్రతీ ఎన్నికల ముందు 'భట్టి' పూజలు
- ఈసారి కూడా కొనసాగిన ఆనవాయితీ


శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయం, ధ్వజస్తంభం


యోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భట్టి విక్రమార్క (ఫైల్)

ముదిగొండ: ముదిగొండ మండలం యడవల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి 800 ఏళ్ల చరిత్ర ఉంది. కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడిగా పేరు ఉన్న ఆయనను భక్తులు నిష్ఠతో కొలుస్తారు. ఇదేకాకుండా పలువురికి విజయాలు అందించిన దేవుడిగా కూడా స్వామికి పేరు! అసెంబ్లీ ఎన్నికల వేళ మండలంలో ప్రచారం మొదలుపెట్టాలంటే ఏ పార్టీ అభ్యర్థి అయిన స్వామిని దర్శించుకుని పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

'జలగం' నుంచి మొదలు

ప్రజలకే కాకుండా ఎన్నికల్లో పోటీకి దిగే నేతలకు శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి అభయమిస్తున్నారు. 1977–78లో జలగం వెంగళరావు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీకి దిగినప్పుడు మొదట స్వామిని దర్శించుకున్నాకే ప్రచారం మొదలుపెట్టారు. ఇక 1981–82లో అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారానికి మొదలు ఇక్కడ పూజలు చేశారు. అతర్వాత పాలేరు ఎమ్మెల్యేగా పోటీచేసిన సంభాని చంద్రశేఖర్ రెండు పర్యాయాలు యడవల్లిలోని యోగానందలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు చేశాకే ముందుకు సాగారు. అనంతరం సండ్ర వెంకటవీరయ్య కూడా ఇక్కడ సెంటిమెంట్‌గా పూజలు చేసి ప్రచారం మొదలుపెట్టారు. ప్రస్తుతం మధిర నుంచి మూడు సార్లు గెలిచిన మల్లు భట్టి విక్రమార్క ప్రతీసారి ఈ ఆలయంలో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ఎన్నికల్లో కూడా ఆయన స్వామిని దర్శించుకున్నాకే మండలంలో ప్రచారాన్ని ప్రారంభించారు. అలాగే, బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ కూడా గత ఎన్నికల వేళ స్వామిని దర్శించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయినప్పటికీ... ఈసారి కూడా సెంటిమెంట్‌గా శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ఆరంభించారు. ఇలా 46 ఏళ్లుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది గెలుపోటములను పట్టించుకోకుండా స్వామిని దర్శించుకున్నాకే ప్రచారాన్ని మొదలుపెడుతున్నారు.

స్వామి అనుగ్రహంతో విజయాలు



ఈ ఆలయానికి దాదాపు 800ఏళ్ల చరిత్ర ఉంది. ఏ కార్యం చేపట్టే ముందైనా మహిమాన్వితుడైన స్వామిని దర్శించుకుంటే విజయాలు సిద్ధిస్తాయి. మా తాత, తండ్రి మొదలు నేను ఇక్కడ స్వామి అనుగ్రహంతో ప్రధాన అర్చకులుగా కొనసాగుతున్నాం. కోరిన కోర్కెలు తీర్చే శ్రీయోగానంద లక్ష్మీనరసింహుడిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుంది.

– సిరికొండ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

ఎంపీ నామా, మంత్రి పువ్వాడ వాహనాలు తనిఖీ

మధిర/కొణిజర్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మధిరకు వస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు వాహనాన్ని మండలంలోని ఆత్కూరు క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి సహకరించగా, కాన్వాయ్‌లోని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైరా ఏసీపీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కొణిజర్లలోని చెక్‌పోస్టు వద్ద కూడా ఎంపీ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు.

మంత్రి పువ్వాడ వాహనం..

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముగించుకుని ఖమ్మం వెళ్తున్న రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ వాహనాన్ని నగరంలోని సాగర్ కెనాల్ వద్ద అధికారులు తనిఖీ చేశారు. తనిఖీలు పూర్తయ్యే వరకు సహకరించిన పువ్వాడ.. అనంతరం ముందుకు సాగారు.

తాయిలాలకు లొంగి కేసీఆర్‌కు అధికారం ఇవ్వొద్దు

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు


మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, నిరంకుశంగా వ్యవహరిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించడమే అందరి లక్ష్యం కావాలని.. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థుల తాయిలాలకు లొంగి ఓటు వేయొద్దని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాగైనా మూడోసారి అధికారంలోకి రావాలని కేసీఆర్ మద్యం, నగదు పంపిణీ మొదలుపెట్టారని విమర్శించారు. ఇలాంటి వాటిని ప్రజలు తిప్పికొట్టాలే తప్ప లొంగిపోవద్దని కోరారు. గత రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రకరకాల పథకాలు ప్రకటించినా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వేలాది కుటుంబాల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే అభివృద్ధి చెందిందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేశారని ఆరోపించారు. ఇక మోదీకి నమ్మిన బంటుగా మారి ఆయన తీసుకునే ప్రజా వ్యతిరేక విధానాలకు కేసీఆర్ అండగా నిలిచారని, వీరిద్దరికి గుణపాఠం చెప్పేలా బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించాలని రంగారావు పిలుపునిచ్చారు. సమావేశంలో వి.మనోహర్‌రాజు, ఆవుల వెంకటేశ్వర్లు, సీపై పుల్లయ్య, ఆవుల అశోక్, కొల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, రాయల రవికుమార్, మంగతాయి, శిరోమణి, కె.శ్రీనివాస్, ఆజాద్, శోభ, వెంకటేష్, చందు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

2024 నాటికి బీజేపీని తరిమికొట్టాలి

- ప్రజల పక్షాన పోరాడని పార్టీలకు ఓటు ఎందుకు వేయాలి?
- త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్


కూసుమంచిలో మాట్లాడుతున్న మాణిక్ సర్కార్, పక్కన తమ్మినేని తదితరులు

కూసుమంచి: దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ, కార్పొరేట్ శక్తులకు ప్రజాధనాన్ని ధారాదత్తం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని 2024 నాటికి తరిమికొట్టాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. సీపీఎం పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ కూసుమంచిలో ఆదివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పాలేరులో పోటీ చేస్తున్న తమ్మినేని వీరభద్రం గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసి ప్రజాసమస్యలపై చట్టసభల్లో తన గళం వినిపించారని తెలిపారు. ఈసారి ఆయనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి పోరాడుతారన్నారు. కాగా, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు డబ్బు రాజకీయాలు చేస్తుండగా.. ఓటర్లకు నగదు ఇవ్వకుండా ఓటు అడిగే ధైర్యం కమ్యూనిస్టులకే ఉందని తెలిపారు. ప్రజలు బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకతతో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చూస్తున్నారని.. కానీ కాంగ్రెస్ కంటే తమకు ఓటు వేయడమే మేలని చెప్పారు. పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం మాట్లాడగా నాయకులు బి.వెంకట్, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, బుగ్గవీటి సరళ, ఎడవెల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన రాజకీయాలను ఓడించండి..

ఖమ్మంరూరల్: ధనంతో రాజకీయం చేసేవారిని ఓడించాలని పాలేరు సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం కోరారు. ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ డబ్బుతో గెలవాలని చూస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ప్రజలు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి, బి.రమేష్, పి.సంగయ్య, సండ్ర ప్రసాద్, పి.మోహన్‌రావు, నందిగామ. కృష్ణ, మోరబోయిన పుల్లయ్య, ఏటుకూరి ప్రసాద్‌రావు, కె.ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి

కలెక్టర్ వి.పి గౌతమ్

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ 30వ తేదీన జరగనున్న దృష్ట్యా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆదివారం ఆయన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. ఓటర్ సమాచార స్లిప్పుల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్లపై సమీక్షించాక పోలింగ్ కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీపీఓ విజయనిర్మల, డీఈఓ సోమశేఖరశర్మ, కలెక్టరేట్ ఏఓ అరుణ, పర్యవేక్షకులు మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో తనిఖీ

ఖమ్మంలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ గౌతమ్ ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. డీఎఫ్ఓ కార్యాలయం, ప్రభుత్వ మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలు, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జగ్గయ్య మిల్లు ఏరియా పాఠశాల, అగ్రహారం పాఠశాల, ధంసలాపురంలోని మున్సిపల్ కార్యాలయం, హార్వెస్ట్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసిన ఆయన మిగిలిన పనులుత్వరగా పూర్తిచేయాలని సూచించారు. డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, కేఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, అధికారులు కవిత, కుమార్, ఝాన్సీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.3.40లక్షల విలువైన గంజాయి పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ అధికారులు

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో రూ.3.40 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్–2 వైపు తనిఖీలు చేస్తుండగా ప్రహరీ వద్ద 13 కేజీల గంజాయి బస్తాలు కనిపించడంతో సీజ్ చేశారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్, ఎస్‌ఐలు షేక్ ముబషీర్ అహ్మద్, ఎస్.అనిల్, సిబ్బంది ఎంఏ కరీం, సుధీర్, హరీశ్, వెంకట్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులో మద్యం పట్టివేత

నేలకొండపల్లి: మండలంలోని ఓ బెల్ట్‌షాపు నుంచి నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీసులు ఆదివారం మద్యం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని బైరవునిపల్లికి చెందిన ఓ బెల్ట్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో సీఐ కుమ్మరి పోశెట్టి ఆధ్వర్యాన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 68 క్వార్టర్లు, 90 ఎంఎల్ సీసాలు 14, ఎనిమిది బీర్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐలు రాధాకృష్ణ, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ వద్ద నగదుపై వివాదం

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెంలో చేపట్టిన తనిఖీల్లో ఓ ఆటోడ్రైవర్ వద్ద నగదు లభించగా, వివాదం నెలకొంది. ముజ్జుగూడెంనకు చెందిన ఓ ఆటోడ్రైవర్ పత్తి కూలీలకు ఇచ్చేందుకు రూ.9,500 నగదుతో ఆదివారం వెళ్తున్నాడు. ఈ సందర్భంగా గ్రామంలో తనిఖీ చేపట్టిన స్పెషల్ స్క్వాడ్ అధికారులు ఆయనను విచారించారు. డబ్బు స్వాధీనం చేసుకుంటామని చెప్పడంతో స్థానికులు నిలదీశారు. కూలీలకు ఇచ్చే డబ్బు విషయంలో రాద్ధాంతం చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేయగా, అధికారులు నగదు తిరిగి ఇచ్చేసి వెళ్లిపోయారు.

అండర్-14 క్రికెట్ జట్టు సిద్ధం


జట్టుకు ఎంపికైన వారితో అధికారులు, పీఈటీలు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14 బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ పోటీలకు 120 మంది క్రికెటర్లు హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన వారితో జట్టును ఎంపిక చేశామని జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా జట్టుకు కె.శ్రీచరణ్, సీహెచ్ ధరణి, సాయికార్తీక్, సుజిత్, సంజయ్ పట్నాయక్, జి.సాయిచంద్ర, ఎస్.రిత్విక్, ఏ.సాయిసాకేత్, పి.విహాన్, డి.ఏషియన్ రాహుల్, డి.ఉన్నత, వి.దాక్షిత్‌రెడ్డి, కె.సాయిరిత్విక్, డి.సాయికార్తికేయ, ఆర్.శౌరి, ఎం.యశ్వంత్, కె.పూజిత్, డి.దీపక్‌నాయక్, ఎల్.రుత్విక్‌రెడ్డి, ఎండీ అతిఫ్ రోషన్, బి.హర్షవర్ధన్ ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ పోటీలను పీఈటీలు సైదేశ్వరరావు, అంజయ్య, విజయ్‌కుమార్, సంపత్, రఘు, నరేశ్, వి.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మూడు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు

ఖమ్మంక్రైం: కన్నుమూసిన మూడు రోజులకు మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించగా ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వడ్డేటి సత్యవతి(45)ని భర్త వదిలివేయటంతో ఖమ్మం రేవతి థియేటర్ ప్రాంతంలో ఒంటరిగా జీవిస్తోంది. అయితే, ఆమె మూడు రోజులుగా కనిపించకపోవటంతో స్థానికులు ఆదివారం పరిశీలించగా ఇంట్లో నుంచి దుర్వాసన వచ్చింది. దీంతో పోలీసులు చేరుకుని చూడగా సత్యవతి మృతదేహం కనిపించింది. అనారోగ్యం బారిన పడిన ఆమెను ఎవరూ పట్టించుకోకపోవటంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.